మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల/నారాయణపేట



## భూ భారతి దరఖాస్తులను
# వెంటనే పరిష్కరించాలి: కలెక్టర్



సమావేశంలో అధికారులను ఆదేశిస్తున్న కలెక్టర్ సంతోష్

**గద్వాల టౌన్, జూలై 30, ప్రభాతవార్త:** భూ భారతి రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులపై తహాశీల్దార్లు దృష్టిసారించి వేగవంతంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ తహసీల్దార్లను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ కాన్ఫరెన్స్ సమావేశపు హాలులో భూ భారతి రెవెన్యూ సదస్సుల దరఖాస్తులు పరిష్కారానికి తీసుకున్న చర్యలపై తహసీల్దార్‌లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ లతో మండలాల వారీగా భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. భూ భారతి రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తుల క్షేత్ర స్థాయి విచారణ నిర్వహించి వెంటనే పరిష్కారం చేయాలని సూచించారు. భూ భారతి రెవెన్యూ సదస్సులలో వచ్చిన సక్సేషన్, పెండింగ్ మ్యుటేషన్, పిఓపి, డి.ఎస్. పెండింగ్ అన్ని దరఖాస్తులు పరిష్కరించాల్సి ఉన్నందున దరఖాస్తుల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. దరఖాస్తులు పరిష్కారంలో వేగం పెంచాలని ఆదేశించారు. వచ్చేవారం చేపట్టిన చర్యలపై తిరిగి సమీక్షి ంచడం జరుగుతుందని తెలిపారు. మీసేవ ద్వారా వచ్చే బర్త్, డెత్, ఆదాయ, రెసిడెన్సు, యాఫ్ లైన్ సర్టిఫికెట్లను ఎప్పటికప్పుడు క్లియర్ చేయాలని తహసీల్దారులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లక్ష్మీనారాయణ, ఆర్.డి.ఓ. అలివేలు, ఏఓ భూపాల్ రెడ్డి, తహశీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు

## ప్రాజెక్టులకు
# భారీ వరద

- శ్రీశైలానికి ఇన్‌ఫ్లో 2,56,699..
  అవుట్ ఫ్లో 3,10,398క్యూసెక్కులు
- 8గేట్లు ఎత్తి సాగర్‌కు నీటి విడుదల
- జూరాల 1.78లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- 15గేట్లు ఎత్తి దిగువకు నీటివిడుదల



శ్రీశైల నుంచి విడుదలవుతున్న వరద

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 30, ప్రభాతవార్త:** తుంగభద్ర, కృష్ణా నదులకు భారీగా వరద రావడంతో ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయి. శ్రీశైలం జలాశయానికి సుంకేసుల, జూరాల డ్యాంల నుంచి భారీగా వరద వచ్చి చేరుతున్నది. దీంతో శ్రీశైలం డ్యాం నిండుకుండను తలపిస్తున్నది. దీంతో ప్రాజెక్టు 7గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలానికి జూరాల పవర్‌హౌజ్ ద్వారా 27,349క్యూసెక్కులు, స్పిల్‌వే ద్వారా 1,18,872క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 1,10,478క్యూసెక్కుల వరద జలాశయానికి చేరుకుంటున్నది. డ్యాం నుంచి 3,10,398క్యూసెక్కులు దిగువకు విడుదలవుతున్నాయి. డ్యాం పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులకుగానూ 882.90అడుగులకు చేరగా, 215.8070 టీఎంసీలకు గానూ – మిగతా4లో..

## పాఠశాల అభివృద్ధికి
# గ్రామ కమిటీల సమావేశం

**తెలంగాణ పబ్లిక్ పాఠశాల నిర్వహన**
**సమావేశంలో విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళీ**



సమావేశంలో పాఠశాల అభివృద్ధికై చర్చిస్తున్న దృశ్యం

**వంగూరు, జూలై 30 ప్రభాతవార్త:** తెలంగాణ పబ్లిక్ పాఠశాల నిర్వహణపై తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళీ, కమిషన్ సభ్యులు డాక్టర్ చారకొండ వెంకటేష్, సభ్యులు విశ్వేశ్వర్‌రావు బృందం బుధవారం వంగూరు,పోల్కంపల్లి పాఠశాలలో – మిగతా4లో..

విద్యార్థులు హాస్టల్ నుంచి గద్వాల వరకు ర్యాలీగా వెళుతున్న దృశ్యం



# రోడ్డెక్కిన విద్యార్థులు

## మధ్యలో అడ్డుకున్న పోలీసులు

**మానవపాడు, జూలై 30 ప్రభాతవార్త :** జోగులాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండలం అలంపూర్ చౌరస్తాలోని మహాత్మ జ్యోతిరావు పూలే బాలుర పాఠశాల విద్యార్థులు బుధవారం ఉదయం రొడ్డెక్కారు. హాస్టల్లో పురుగుల అన్నం, ఉప్పు నీళ్లు, బాత్రూముల వంటి పలు సమస్యలపై ప్రిన్సిపాల్‌కు పలుమార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో విద్యార్థులు హాస్టల్ నుంచి గద్వాల వరకు ర్యాలీగా వెళ్లి తమ గోడు కలెక్టర్‌కు చెప్పుకోవాలనుకున్నారు. పదవ తరగతికి చెందిన 56 మంది విద్యార్థులు 44వ జాతీయ రహదారిపై దాదాపు 8 కిలోమీటర్ల వరకు నడిచి వెళ్లారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఇటిక్యాల పాడు స్టేజి వద్ద అడ్డుకున్నారు. అల్లంపూర్ సిఐ రవిబాబు, ఉండవల్లి ఎస్సై శేఖర్ మానవపాడు ఎస్సై చంద్రకాంత్ విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను ఆరా తీశారు. ఉన్నత అధికారుల దృష్టికి మీ సమస్యను తీసుకెళ్లి పరిష్కరిస్తామని చెప్పిన విద్యార్థులు వినిపించుకోలేదు. దీంతో పోలీసులు డీసీఎంలో ఎక్కించి పాఠశాలకు చేర్చారు.

**గురుకుల పాఠశాలను పరిశీలించిన అదనపు కలెక్టర్ ...**

హాస్టల్లో నెలకొన్న సమస్యలపై విద్యార్థులు రోడెక్కరన్న సమాచారం మేరకు అలంపూర్ చౌరస్తాలోని మహాత్మ జ్యోతి పూలే గురుకుల బాలుర పాఠశాలను జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావు పరిశీలించారు.అనంతరం విద్యార్థులతో మాట్లాడారు.పురుగులు అన్నం పెడుతున్నారని విద్యార్థులకు సరిపడా బాత్రూం లేకపోవడంతో ఆరుబయటకు వెళ్తున్నామని అదనపు కలెక్టర్‌కు మొరపెట్టుకున్నారు.అనంతరం అదనపు కలెక్టర్ నర్సింగరావు హాస్టల్ పరిసరాలను, వంటశాల,రూములను పరిశీలించారు. జరిగిన ఘటనపై ఉపాధ్యాయులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలలో పనిచేస్తున్న సిబ్బందిని పిలిచి మాట్లాడారు. విద్యార్థులకు మెనూ ప్రకారమే నాణ్యమైన భోజనం అందించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఉపాధ్యాయులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. మరొకసారి ఇలాంటి సంఘటనలు పునరావృతమైతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



స్టాఫ్‌తో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

# పేదోడి ఆత్మగౌరవ ప్రతీక రేషన్ కార్డు

## అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ

**వంగూరు, జూలై 30 ప్రభాతవార్త:** బడుగు బలహీన వర్గాల ప్రజలకు రేషన్ కార్డును అందించి రేషన్ షాపులలో సన్నబియ్యాన్ని సరఫరాచేసి 3 పూటల భోజనాన్ని అందించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రతి అర్హత కలిగిన పౌరులకు రేషన్ కార్డు అందించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ పేర్కొన్నారు. బుధవారం వంగూరు మండల కేంద్రలో ఏర్పాటు చేసిన రేషన్ కార్డుల పంపిణి కార్యక్రమానికి అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీ కృష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటి నుంచి నేటి వరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ మాట తప్పని మడిమ తిప్పని ప్రభుత్వమని పేద ప్రజల ఆత్మవిశ్వాసంగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు కృషి చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. పేదోడి ఆత్మగౌరవ ప్రతీక కొత్త రేషన్ కార్డులని,సన్నబియ్యం,రైతుకు రుణమాఫీ,రైతు భరోసా, సన్నధాన్యానికి బోనస్ కల్పించి రైతన్నకు ఆసరాగా నిలిచిన ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ అని ఆయన గుర్తు చేశారు. ఆడబిడ్డలకు ఆర్టీసీలో ప్రయాణాన్ని ఉచితంగా అందించమని, పేదల ఇళ్లకు ఉచిత కరెంటును అందించి, లెక్కకు మిక్కిలిగా సంక్షేమం కోసం కృషి చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ పథకాలన్ని కేవలం ఇందిరమ్మ రాజ్యంలో మాత్రమే సాధ్యమని, మరోసారి రుజువు చేశామన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళల కోసం ప్రత్యేకంగా వడ్డీలేని రుణాలను అందిస్తున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేయటమే తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. రుణాలను తీసుకున్నవారికి నచ్చిన విధంగా ఎవ్వరి కాలమీద వారు కష్టపడి నిజాయితీగా వ్యాపారం చేసుకుంటూ వారి కుటుంబ సభ్యులు ఆర్థికంగా ఎదగాలని అన్నారు. ప్రభుత్వం మహిళ సంఘాలకు వడ్డీలేని రుణాలు, సంఘంలో ఉన్న సభ్యురాలు ప్రమాదవశాత్తు చనిపోతే ప్రమాద బీమా వర్తిస్తుందని అన్నారు. ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు, సోలార్ పవర్ ప్లాంట్లను, పెట్రోల్ బంకులను, పాఠశాల యూనిఫాం స్టిచ్చింగ్, కోళ్ల పెంపకం, పాల డైరీల ఏర్పాటుకు మహిళల ఆర్థిక అభివృద్ధికి ప్రోత్సహిస్తామని అన్నారు. వెనుకబడిన మహిళలకు చేయుతగా ఉచిత ఆర్టీసీ ప్రయాణంలో పాటు ఇందిరమ్మ ఇళ్లను మహిళల పేరిట మంజూరు చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ కుడుముల సురేందర్ రెడ్డి, మంద హర్షిత్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ అచ్చంపేట నియోజకవర్గం అధ్యక్షులు క్యామ మల్లయ్య, మాజీ ఎంపీటీసీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బాదమోని రమేష్ గౌడ్, సీనియర్ నాయకులు అల్వాల్ రెడ్డి, వెంకటయ్యాయాదవ్, హేమారెడ్డి, మహేష్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు చంద్రశేఖర్, శంకర్, జనార్ధన్, గఫూర్, ప్రజా ప్రతినిధులు, మండల పార్టీ నాయకులు,మహిళలు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



లబ్ధిదారులకు రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

## జడ్చర్లకు బైపాస్
# ఏర్పాటు చేయండి

**కేంద్ర మంత్రిని కోరిన ఎంపీ డీకే అరుణ**
**పాల్గొన్న ఎమ్మెల్యేలు అనిరుధ్‌రెడ్డి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి**



నితిన్ గడ్కరీకి వినతి అందజేస్తున్న ఎంపీ డీకే అరుణ, చిత్రంలో ఎమ్మెల్యేలు యెన్నం, అనిరుధ్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై30, ప్రభాతవార్త :** జడ్చర్ల కొత్తగా బైపాస్ ఏర్పాటు చేయాలని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ కోరారు. ఈమేరకు బుధవారం ఎమ్మెల్యేలు అనిరుధ్‌రెడ్డి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డితో కలిసి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని మర్యాద పూర్వకంగా కలిశారు. పలు సమస్యలను గడ్కరీ దృష్టికి తీసుకెళ్లారు. జడ్చర్లకు బైపాస్ ఏర్పాటు చేస్తే రాయిచూర్, మహబూబ్‌నగర్, నారాయణపేట, కర్ణాటక రాష్ట్రం వైపు వెళ్లేవారు జడ్చర్ల పట్టణంలోకి వెళ్లాల్సిన అవసరం ఉండదని, ప్రయాణం మరింత సులువుగా, ఉంటుందని, సమయం కూడా ఆదా అవుతుందని వివరించారు. జడ్చర్ల మీదుగా మహబూబ్ నగర్ గుండా వెళ్లే జాతీయ రహదారి 167 నుంచి జాతీయ రహదారి 44 ని కలుపుతూ.. తిరిగి 167 కు అనుసంధానం అయ్యేలా జడ్చర్ల చుట్టూ బై పాస్ రోడ్డు నిర్మించాలని వినతిలో పేర్కొన్నారు. వాహనాల రద్దీ నేపథ్యంలో జడ్చర్ల, పట్టణ ప్రజల ఇబ్బందులను కేంద్ర మంత్రికి ఎంపీ వివరించారు. బైపాస్ ఏర్పాటుచేయాల్సిన అవసరం ఆవశ్యకతను క్షుణ్ణంగా తెలిపారు. అదేవిధంగా మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే మాట్లాడుతూ మహబూబ్ నగర్ బై పాస్ రోడ్డు నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఎంపీ అరుణమ్మ ప్రతిపాదనలపై గడ్కరీ సానుకూలంగా స్పందించినట్లు ఆమె తెలిపారు.

# పిచ్చి కుక్క స్వైర విహారం

**ఆరుగురికి తీవ్ర గాయాలు.. ఏడేండ్ల బాలుడి పరిస్థితి విషమం**

**బిజినపల్లి, జూలై 30 ప్రభాతవార్త:** పిచ్చి కుక్క స్వైర విహారం చేసి ఆరుగురిని తీవ్ర గాయాల పాలు చేసిన సంఘటన వట్టెం గ్రామంలో చోటు చేసుకుంది. బుధవారం సాయంత్రం పిచ్చికుక్క వీధుల వెంట తిరుగుతూ గ్రామానికి చెందిన బంగారమ్మ, సరిత, శివ, ఏడేండ్ల బాలుడు, మరో ఇద్దరినీ గాయపరిచినట్లు తెలిపారు. గాయపడ్డ వారికి బిజినేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స అందించారు. పిచ్చికుక్క దాడిలో తీవ్రంగా గాయపడిన బాలుడి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం జిల్లా ఆసుపత్రికి తరలించారు. అరుగురు పై దాడి చేసి తీవ్రంగా గాయపర్చిన పిచ్చికుక్కను గ్రామస్తులు కొట్టి చంపినట్లు గ్రామస్తులు తెలిపారు. కొంతకాలంగా పిచ్చికుక్క గ్రామంలో తిరగడానికి గమనించి గ్రామపంచాయతీ సిబ్బందికి తెలిపిన పట్టించుకోకపోవడంతో ఈ ఘటన జరిగినట్లు బాధితులు ఆవేదన వెలిబుచ్చారు.



పిచ్చికుక్క దాడిలో గాయపడిన మహిళ

## తొలి ఇందిరమ్మ
# ఇంటి గృహప్రవేశం

**ఇందిరమ్మ రాజ్యంలో నెరవేరిన సొంత ఇంటి కల**
**హాజరైన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**
**దంపతులకు నూతన వస్త్రాలు అందించిన ఎమ్మెల్యే**



చీర్కపల్లి గాంధీనగర్ కాలనీలో గృహప్రవేశం చేసిన ఇందిరమ్మ ఇల్లు



లబ్ధిదారులకు నూతన వస్త్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే

**వనపర్తి ప్రతినిధి, జూలై 30 ప్రభాతవార్త:** నియోజకవర్గంలోని తొలి ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశనికి హాజరై ఇచ్చిన మాట ప్రకారం ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు నూతన వస్త్రాలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఏదుల మండలం చీర్కపల్లి గాంధీ నగర్ కాలనీలో దేవరీ రేణుక భర్త ఎల్లస్వామి నిర్మించుకున్న నూతన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశానికి బుధవారం వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా సొంతింటి నిర్మాణం కోసం కలలు కన్న కుటుంబాలు నేడు ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలతో వారి సొంతింటి కలను నెరవేర్చుకుంటున్నారని గత 10 సంవత్సరాల కాలంలో ఇల్లు లేని నిరుపేదలు తీవ్ర ఇబ్బందులు అనుభవించారని గుర్తు చేశారు. నేడు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇల్లు లేని ప్రతి ఒక్కరికి ఐదు లక్షల రూపాయల ఖర్చుతో సొంతింటి కల సహకారం చేస్తుందని ఆయన తెలిపారు. వనపర్తి నియోజకవర్గ మొత్తంలో 3500 ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణం అవుతున్నాయని మరో 2000 ఇండ్లను అదనంగా మంజూరు చేయించి అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం చేయిస్తామని హామీ ఇచ్చారు. ఈ మూడేళ్ల కాలంలో నియోజకవర్గంలో పూరిగుడిసె, రేకుల ఇల్లు, పాత మట్టి మిద్దెలు లాంటివి లేకుండా అందరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయించి ఇంటి ఇబ్బందులు తొలగించి సొంత ఇంటి కల నెరవేరుస్తామని భరోసా కల్పిచారు. ఈ కార్యక్రమంలో గోపాల్పేట ఉమ్మడి మండలం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ సత్యశీలరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ రఘు యాదవ్, జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ కొంకి వెంకటేష్, రేవెల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వాడల పర్వతాలు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు జమ్మి మల్లేష్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పందెం సుఖేందర్ రెడ్డి, సురేష్ గౌడ్, బాలస్వామి, చీర్కపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పరశురాములు, వెంకటస్వామి, రవి, కాశీం, రామకృష్ణ, వివిధ గ్రామాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సిబ్బంది తీరు మారకుంటే
# చర్యలు తప్పవు

- కోటకొండ పిహెచ్‌సీని తనిఖీ చేసిన కలెక్టర్
- ఏఎన్‌సీ, టీబీ, ఎన్‌సీడీ కార్యక్రమాల తీరు బాగాలేదు
- 6 వేలకు పైగా జనాభా కలిగిన ప్రాంతంలో కేవలం 2 డెలివరీలపై ఆగ్రహం
- ప్రతీది సూపర్‌వైజర్‌పై ఆధార పడితే ఎలా? సిబ్బందికి ప్రశ్న...



పిహెచ్‌సి సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్



పేషంట్స్‌తో మాట్లాడుతున్న కలెక్టర్

**నారాయణపేట ప్రతినిధి, జూలై 30 ప్రభాతవార్త :** మండలం పరిధిలోని కోటకొండ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో ఓపీ చాలా తక్కువ ఉండటం గమనించిన కలెక్టర్ అక్కడి డాక్టర్‌ను వివరణ కోరారు. అలాగే ఎన్‌సీడీ ప్రోగ్రాం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈడీడీ ఎన్ని ఉన్నాయని ప్రశ్నించారు. దాదాపు 6 వేలకు పైగా జనాభా కలిగిన ప్రాంతంలో గత మార్చి, ఏప్రిల్ నెలలో ఒక్క డెలివరీ కాలేదని రిజిస్టర్ ను చూసి తెలుసుకున్నారు. ఈ డీ డీ అప్ డేట్ లేకపోవడం, జూలై నెలలో కేవలం రెండు డెలివరీలు మాత్రమే జరిగాయని తెలిసి కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆస్పత్రిలోనే ప్రసవం చేసుకునేలా మహిళలకు అవగాహన కల్పించాలని ఆమె సూచించారు. పీహెచ్‌సీ పరిధిలోని 10 సబ్ సెంటర్లకు గాను 16 మంది డాక్టర్లు ఉన్నా ప్రోగ్రామ్ ఆఫీసర్లు ఎందుకు విజిట్ చేయడం లేదని డాక్టర్ ను ఆమె ప్రశ్నించారు. ఏఎన్‌సీ, టీబీ, ఎన్‌సీడీ కార్యక్రమాల తీరు సక్రమంగా లేదన్నారు. పీహెచ్‌సీ పరిధిలో ఎన్ని పాఠశాలలు ఉన్నాయని ఆరా తీసిన కలెక్టర్ ప్రతీ గురువారం ఐరన్ ఫోలిక్ యాసిడ్ టాబ్లెట్లు ఇస్తున్నారా లేదా అని ప్రశ్నించారు. టాబ్లెట్లు నిల్వ ఉన్నా ఎందుకు ఇవ్వడం లేదని తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. తనిఖీ సమయంలో ఆస్పత్రి రిజిస్టర్లు అందుబాటులో లేకపోవడం పై వైద్య సిబ్బందిని – మిగతా4లో..

## ప్రజా ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

### లిక్విడ్ ఆక్సిజన్ ప్లాంట్ ప్రారంభించిన ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

**గద్వాలటౌన్ జూలై30,ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి నందు లిక్విడ్ ఆక్సిజన్ ప్లాంట్,వెయిటింగ్ హాల్‌ల ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిదులుగా ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి,అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు హాజరయ్యారు. 2కోట్ల 60లక్షల వ్యయంతో లిక్విడ్ ఆక్సిజన్ ప్లాంట్‌ను రిబ్బన్ కటింగ్ చేసి ఎమ్మెల్యేలు,జిల్లాకలెక్టర్ ప్రారంభించారు. అనంతరం వెయిటింగ్ హాల్లో,న్యాయ వైద్యశాస్త్రం విభాగంను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా ఆరోగ్యం సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలోనే మొట్టమొదటిగా గద్వాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో లిక్విడ్ ఆక్సిజన్ ప్లాంటును ఏర్పాటు చేయడంతో సీఎంకు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి కి ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలిపారు. గద్వాల ప్రాంతంలోని ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్లే అవసరం లేకుండా ఆసుపత్రిలోనే అన్ని రకాల వైద్య సదుపాయాలను కల్పించి, ప్రజలకు ఆక్సిజన్ ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు . అదేవిధంగా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా మెరుగైన వైద్యం అందించే విధంగా వైద్యులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని సూచించారు. భవిష్యత్తులో గద్వాల ఆసుపత్రిలో మరింత అభివృద్ధి చెందే విధంగా నా వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ కురువ హనుమంతు,జిల్లా గ్రంథాలయ మాజీ ఛైర్మన్ జంబు రామన్ గౌడు మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ బాబర్, మాజీ ఎంపీపీ విజయ్, మాజీ జెడ్పిటిసి రాజశేఖర్, ఆలయం కమిటీ ఛైర్మన్ బోయ వెంకటరాములు, మాజీ కౌన్సిలర్స్ నాగిరెడ్డి నరహరి శ్రీనివాసులు, పూడూరు కృష్ణ, శ్రీను ముదిరాజ్, సుధాకర్, మాజీ ఎంపీటీసీ ఆనంద్ గౌడు నాయకులు గోవిందు ధర్మ నాయుడు, ఉరుకుందు, చంద్రశేఖర్ యుగంధర్ గౌడ్ నాగేంద్ర యాదవ్, జానకి రాములు, ఓం ప్రకాష్ ప్రవీణ్, జిల్లా ఆస్పత్రిలో వైద్యులు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఉప్పునుంతలలో రేషన్ కార్డుల పంపిణీ

### డీలర్లకు సూచించిన తహసీల్దార్ ప్రమీల

**ఉప్పునుంతల, జూలై 30 ప్రభాతవార్త :** నేడు గురువారం కొత్త గా మంజూరైన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ప్రమీల, ఉప తహసీల్దార్ పరుష్ నాయక్‌లు తెలిపారు. రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమానికి టిపిసిసి ఉపాధ్యక్షుడు, నాగర్ కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు,అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడువంశీకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరవుతున్నారని, ఈ కార్యక్రమం మధ్యాహ్నం 2గం.లకు స్థానిక కొత్త యశోదఫంక్షన్ హాల్‌లో జరుగనున్నట్లు వారు వివరించారు. అందుకని మండలంలోని అన్ని గ్రామాల రేషన్ డీలర్లు నూతనంగా మంజూరైన రేషన్ కార్డుల లబ్ధిదారులు, కార్డులో కుటుంబ సభ్యులను చేర్చిన లబ్ధిదారులు ప్రతి ఒక్కరూ వచ్చే విధంగా రేషన్ డీలర్లు కృషి చేయాలని వారు పేర్కొన్నారు. రేషన్ కార్డులు మంజూరైన లబ్ధిదారులు, రేషన్ కార్డులో కొత్తగా చేర్చిన లబ్ధిదారులు సకాలంలో సమావేశానికి హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తహసీల్దార్ ప్రమీల, ఉప తహసీల్దార్ పరుష్ నాయక్‌లు కోరారు.

## ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని సందర్శించిన నాబార్డ్ అధికారులు



ఉప్పునుంతల ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం కార్యాలయంలో నాబార్డ్ అధికారుల తనిఖీలు

**ఉప్పునుంతల, జూలై 30 ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉప్పునుంతల ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం కార్యాలయాన్ని బుధవారం నాబార్డు అధికారులు తనిఖీలు సంవత్సరం వరకు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లావాదేవీలు, రికార్డులను పరిశీలించారు. అనంతరం డిసిసిబి డైరెక్టర్, సింగిల్ విండో ఛైర్మన్ సత్తు భూపాల్ రావు,సంఘ సీఈఓ కొత్త రవీందర్ రావులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా సంఘ కార్యాలయంలోని అన్ని విభాగాల రికార్డు రూం లను, లాకర్లను, ఎరువుల గోదాం లను పరిశీలించి తనిఖీలు నిర్వహించారు. తనిఖీలు నిర్వహించిన నాబార్డ్ అధికారులు ఏజిఎం ర్యాంక్ అధికారి శ్రీనివాసరావు, మేనేజర్ బ్యాంక్ అధికారి స్వప్నిలాల్ , డిసిసిబి ఎజిఎంలు దయాకర్ రెడ్డి, భూపాల్ రెడ్డి, మేనేజర్ రవి, డిసిసిబి డైరెక్టర్, సింగిల్ విండో ఛైర్మన్ సత్తు భూపాల్ రావు,సంఘ సీఈఓ కొత్త రవీందర్ రావు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

## ఉప్పునుంతల ఆసుపత్రిని సందర్శించిన డిసిహెచ్‌ఎస్

**ఉప్పునుంతల,జూలై 30 ప్రభాతవార్త :** నాగర్ కర్నూల్ జిల్లా ఆస్పత్రుల సమన్వయకర్త డాక్టర్ రామకృష్ణ బుధవారం మండల కేంద్రమైన ఉన్న సామాజిక ఆరోగ్య కేంద్రం ( సి హెచ్ సి) ను ఆకస్మిక తనిఖీ చేశారు. ఆసుపత్రిలో విధులకు హాజరవుతున్న సిబ్బంది వివరాలు, హాజరు పట్టికను పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది సమయపాలన పాటిస్తూ అందుబాటులో ఉండి రోగులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. వైద్య సిబ్బంది చెప్ప పెట్టకుండా విధులకు డుమ్మా కొడితే శాఖ పరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. అనంతరం వైద్య సిబ్బందితో మాట్లాడుతూ రోగులకు కావలసిన మందులు సరఫరా అవుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉండేటట్లు చూడాలని సూచించారు. వైద్య సిబ్బంది అందిస్తున్న వైద్య సేవలు, వారి పనితీరు పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. డి సి హెచ్ ఎస్ జిల్లా ఆస్పత్రిల సమన్వయకర్త డాక్టర్ రామకృష్ణ ఆకస్మిక తనిఖీ చేసిన సమయంలో స్థానిక వైద్యాధికారిణి డా. స్వప్న, డా. శివలీల, ఫార్మసిస్ట్ కుమారచారి, వైద్య సిబ్బంది ఉఫత్, నిర్మల, హోమియోపతి సిబ్బంది నజీర్ పాషా తదితరులు ఉన్నారు.

## కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కార్యక్రమం రేషన్ కార్డుల పంపిణీ

**ఖిల్లాఘనపురం జూలై 30, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో పంపిణీ చేసిన రేషన్ కార్డుల పంపిణీ కాంగ్రెస్‌పార్టీ ఎన్నికలకార్యక్రమంలా నిర్వహించారని సమావేశానికి హాజరైన పలుగ్రామాలకు చెందిన ప్రజలు ఆరోపించారు. జిల్లాకలెక్టర్ ఆదర్శసురభితో పాటు జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్న ఈకార్యక్రమంలో ఏహోదాలేని పలువురు వక్తలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని పలుమార్లు విన్నవించడం విస్మయానికి గురిచేసింది. అధికార కాంగ్రెస్ పార్టీ సమావేశం ఉంటే ప్రభుత్వ అధికారులను ఆహ్వానించకుండా కార్యక్రమాలు నిర్వహించాలి అని పలువురు గుసగుసలాడడం వినిపించింది. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లు తహసిల్దార్ సుగుణ, జిల్లా పౌరసరఫరాల అధికారి కాశీ విశ్వనాథ్ పిఎసిఎస్ అధ్యక్షులు మురళీధర్‌రెడ్డి విజయ్‌కుమార్,చరణ్‌రెడ్డి,రమేష్ , ఆధారం ప్రకాష్ పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## అర్హులైన నిరుపేదలందరికీ సంక్షేమ పథకాలను అందజేస్తాం : ఎమ్మెల్యే




సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

**ఖిల్లాఘనపురం. జూలై 30. ప్రభాతవార్త:** రాష్ట్రంలో అర్హులైన ప్రతి నిరుపేదకు అన్ని రకాల సంక్షేమ పథకాలను అందజేస్తామని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో రేషన్ కార్డులు మంజూరు అయిన లబ్ధిదారులకు ప్రొసిడింగ్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా రేషన్ కార్డుల కోసం ఎదురు చూస్తున్న వారి కలను తెలంగాణ ప్రభుత్వం సహకారం చేసిందని ఎమ్మెల్యే అన్నారు. శాసనసభ ఎన్నికల్లో ఇచ్చిన హామీ నేలకు అర్హులైన వారందరికీ కార్డులను మంజూరు చేస్తున్నామని చెప్పారు. అనేక సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని అందుకొరకే అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు మంజూరు చేస్తున్నామన్నారు. శాసనసభ ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు ఆరు గ్యారెంటీలను అమలు చేస్తున్నామని మహాలక్ష్మి పథకంతో మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణంతో పాటు గృహలక్ష్మి పథకంలో అర్హులైన వారందరికీ 200 యూనిట్లలో ఉచిత విద్యుత్ అందజేస్తు న్నామన్నారు. రైతులకు రుణాలు కూడా మాఫీ చేసి వారికి అండగా నిలిచావన్నారు. ప్రతి పేదవా డికి నాణ్యమైన సన్న బియ్యం తినాలని ఆలోచనతో రేషన్ కార్డు కలిగిన పేదలందరికీ సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని చెప్పారు. మండలంలో 349 మంది లబ్ధిదారులతో 521 కొత్త రేషన్ కార్డులను పంపిణీ కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు.

## చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

**బిజినేపల్లి, జూలై 30 ప్రభాతవార్త:** నంది వడ్డేమాన్ గ్రామంలో చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన బాకీ వెంకట్ రాములు(46) గ్రామ సమీపంలోని సూరయ్య కుంటలో చేపల వేటకు వెళ్లాడు. చేపలు పట్టే క్రమంలో వల కాళ్లకు చుట్టుకుని నీట మునిగి మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. మృతుడు తల్లి లక్ష్మిదేవమ్మతో పాటు కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

# రాజకీయాలకతీతంగా పేదలకు ఇంటిని నిర్మిస్తాం



రేచింతల గ్రామంలో నూతన అంగన్వాడి భవనాని ప్రారంభిస్తున్న రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి



వీర రాఘవపురంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలకు భూమి పూజ నిర్వహిస్తున్న రాష్ట్ర మంత్రి

**ఆత్మకూర్ జూలై 30, ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా అర్హులైన లబ్ధిదారులందరికి రాజకీయాల కతీతంగా ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలు అందజేస్తామని రాష్ట్ర పాడి పరిశ్రమ అభివృద్ధి శాఖా మరియు మత్స్యశాఖ మంత్రివర్యులు మొత్తం నియోజకవర్గ శాసనసభ్యులు వాకిటి శ్రీహరి అన్నారు. బుధవారం రోజు ఆత్మకూరు మండలంలోని రేచింతల వీర రాఘవపురం తుంపల్లి తదితర గ్రామాలలో పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు శంకుస్థాపనలు చేసిన అనంతరం రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గత శాసనసభ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఆరోగ్యారెంటీలను అమలు చేయడమే కాకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇంటి నిర్మాణం జరిపిస్తామని ఇందులో రాజకీయాలకు ఎటువంటి ఆస్కారం లేకుండా పేదలందరికీ ఇంటి నిర్మాణాలు పూర్తి చేసి అందజేస్తామని ఆయన అన్నారు. మండలంలోని వీరరాఘవాపురం మరియు పాంపురం మీదుగా జాతీయ రహదారికి అనుసంధానంగా బీటీ రోడ్డు నిర్మించాలంటూ గడచిన కొన్ని సంవత్సరాలుగా ఆయా కట్టకింది గ్రామాల ప్రజలు విజ్ఞప్తులు చేసినప్పటికీ పాలకులు పట్టించుకోలేదని ప్రస్తుత ప్రజా ప్రభుత్వం మాత్రం బిటి రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించడమే కాకుండా యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తిచేసి త్వరలోనే రహదారిని అందుబాటులోకి తీసుకొస్తామని ఆయన వెల్లడించారు. మండలంలోని రేచింతల గ్రామంలో చిన్నారి బాలబాలికల నిమిత్తం నూతనంగా నిర్మించేటువంటి అంగన్వాడీ భవనాన్ని ప్రారంభించి ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పౌష్టికాహారం లోపం మూలంగా ఎవరూ కూడా అనారోగ్య పాలు కాకుండా ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాలను సమర్ధవంతంగా నిర్వహిస్తూ అవసరమైన తగు జాగ్రత్తలు తీసుకుంటుందని మంత్రి అన్నారు. కట్టకింది గ్రామాల ప్రజలు కోరిక మేరకు ప్రియదర్శని జూరాల ప్రాజెక్టు ఎడమ కాలువ కొనసంతానంగా ఉన్నటువంటి డిస్ట్రిబ్యూటరీ ఆరు కాలువను మరమ్మతులు చేయించడమే కాకుండా పూర్తిస్థాయిలో ఆయకట్టు రైతంగానికి సాగునీరు అందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కల్లుగీతా పారిశ్రామిక విభాగం ఛైర్మన్ నాగరాజు గౌడ్, ఆత్మకూరు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పరమేష్, తులసిరాజు యాదవ్, నల్లగొండ శ్రీనివాసులు, మనివర్ధన్ రెడ్డి, గాలి పంపు శ్రీనివాసులు ,గణేష్ ,నర్సింలు, మాజీ ఎంపిటిసి సభ్యులు బిసన్న తదితరులతో పాటుగా పలువురు నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# గిరిజన తండాల అభివృద్ధి ప్రభుత్వ ధ్యేయం

### రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి



అమరచింత మండలంలోని చంద్రప్ప తండాలో తాగునీరు బోర్ పైప్ లైన్ ప్రారంభిస్తున్న రాష్ట్ర మంత్రి, డాక్టర్ వాకిటి శ్రీహరి.

**అమరచింత జూలై 30, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం గిరిజన తండాల అభివృద్ధి ప్రభుత్వ ద్వేయముగా ముందుకు వెళుతుందని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి, డాక్టర్ వాకిటి శ్రీహరి అన్నారు. బుధవారం అమరచింత మండలంలోని చంద్ర నాయక్, దీప్లా నాయక్ గిరిజన తండాలలో 11 లక్షల 90 వేల వ్యయంతో నూతనంగా నిర్మించిన బోర్వెల్ పైప్ లైన్ ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా పిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి, కేశం నాగరాజుగౌడ్ తో కలిసి రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి, డాక్టర్ వాకిటి శ్రీహరి మాట్లాడుతూ, గత 10 ఏళ్ల టిఆర్ఎస్ పాలనలో గిరిజన తండాలకు త్రాగునీరు కల్పించలేదని కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన తర్వాత గిరిజన తండాలకు త్రాగునీరు అందించిన ఘనత కాంగ్రెస్ పార్టీ దేనని ఆయన అన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ పాలనలో గిరిజన తండాలలో ఉన్న జనాభా ప్రతిపాదికన 500 జనాభా కి గ్రామపంచాయతీలను ఏర్పాటు చేశామని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గిరిజనుల సంక్షేమానికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నదని హారులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఆయన గిరిజనులను కోరారు. అమరచింత మున్సిపల్ కేంద్రంలోని శ్రీకృష్ణ నగర్ లో వెలసిన శ్రీ ఆంజనేయ స్వామి గుడి నిర్మాణానికి ప్రభుత్వం 50 లక్షల నిధులు మంజూరయ్యాయని ఆగస్టు 14న ఆంజనేయ స్వామి గుడి నిర్మాణం భూమి పూజ నిర్వహించి నిర్వాహకులకు ప్రొసిడింగ్ అందజేస్తానని హామీ ఇచ్చారు. దేవాలయాల అభివృద్ధికి నా వంతుగా కృషి చేస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి జిల్లా కార్యదర్శి, అయూబ్ ఖాన్, కాంగ్రెస్ పార్టీ అమర్ చింత పట్టణ, మండల అధ్యక్షులు, అరుణ్ కుమార్, కేజీ మహేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు హనుమంతు నాయక్, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, హరీష్ నాయక్, బద్దినాయక్, మాజీ ఎంపిటిసిలు, మహంకాళి విష్ణు, తిరుమలేష్, ఆత్మకూర్ మార్కెట్ డైరెక్టర్లు, పోసిరి గారి విష్ణు, శ్యాం కుమార్, మోహన్, కమలాకర్ గౌడ్, రవికాంత్, కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు, రాకేష్ గౌడ్, తౌఫిక్, మస్తీపురం సత్తన్న, ముని, వెంకట్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ మండల అధ్యక్షులు, లక్ష్మీ మకాంత రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# పత్తి రైతులను దోపిడీ చేస్తున్న ఆర్గనైజర్లు

### ఎమ్మెల్యేకు ఆర్గనైజర్లపై ఉన్న ప్రేమ రైతులపై లేదు : రంజిత్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న నడిగడ్డ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు రంజిత్ కుమార్

**గద్వాల టౌన్, జూలై 30, ప్రభాతవార్త:** నడిగడ్డ ప్రాంతంలోని పత్తి రైతులను ఆర్గజర్లు నిలువు దోపిడి చేస్తున్నారని, స్థానిక ఎమ్మెల్యేకు ఆర్గనైజర్లపై వున్న ప్రేమ రైతులపై లేదని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు రంజిత్ కుమార్ మండిపడ్డారు. గత సంవత్సరం పంటకు పేమెంట్ ఇవ్వడంతోపాటు మొత్తం పంటను కొనుగోలు చేయాలని వారు డిమాండ్ చేశారు. రైతులు వేసిన ప్రస్తుత పంటకు పెట్టుబడి ఇవ్వాలని ఎమ్మెల్యే ఎందుకు డిమాండ్ చేయడం లేదని ప్రశ్నించారు. ఆర్గనైజర్లకు డిలీటింగ్ పర్మిషన్ ఇప్పించడానికి మంత్రిని కలిశారా అని ప్రశ్నించారు. జిల్లాలో విత్తనపత్తి సాగు చేస్తున్నటువంటి రైతులు కంపెనీలు ఆర్గనైజర్ల చేతుల్లో అనేక రకాలుగా దోపిడీకి గురవుతున్న పరిస్థితుల్లో ఏనాడూ రైతుల తరఫున మాట్లాడని ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి , వ్యవసాయ శాఖ మంత్రి ని కలిసి కేవలం కంపెనీల నుండి పేమెంట్ ఇప్పించాలని, ఆర్గనైజర్లకు డిలీటింగ్‌కు పర్మిషన్ ఇవ్వాలని మాత్రమే కోరారని వారన్నారు. ప్రస్తుత సంవత్సర పంటకు పెట్టుబడిని, రైతుల నుండి దిగుబడి మొత్తాన్ని కొనుగోలు చేయాలని ఎందుకు డిమాండ్ చేయలేదని ప్రశ్నించారు. అలాగే కొద్ది రోజుల క్రితం రైతు కమిషన్ వచ్చిన సందర్భంగా జి.ఓ.టి ఫలితాలలో జరిగే అవకతవకల గూర్చి , జీ.వో.టి ఫలితాలతో సంబంధం లేకుండా పేమెంట్ చేయాలని, అలాగే పంట తీసుకున్న తర్వాత మూడు నెలల లోపు పేమెంటు చేయాలని డిమాండ్ చేయగా ఇట్టి విషయాలపై ఒకవైపు రైతు కమిషన్ తో చర్చలు జరుగుతుండగానే మరోవైపు ఎమ్మెల్యే ఆర్గనైజర్లను తీసుకొని వ్యవసాయ శాఖ మంత్రిని కలవడం వెనుక మతలబు ఏంటన్నారు. నడిగడ్డ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో జరిగిన పోరాటాల ఫలితాల వల్ల గత సంవత్సరం ప్యాకెట్ పై రేట్లు పెంచగా ఈ సంవత్సరం తిరిగి రేట్లు పెంచాల్సింది పోయి ఎమ్మెల్యేకు ఇచ్చే కమిషన్ కోసము ప్యాకెట్ పై ధరలు తగ్గించడానికి కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు.

కంపెనీలు, ఆర్గనైజర్లు పండించిన పంట మొత్తాన్ని కొనుగోలు చేయడమే గాక ప్రతి సంవత్సరం పేమెంట్ ని ఏప్రిల్ నెల చివరి వరకు చేయాలని అలాగే ప్యాకెట్ పై రేట్లు పెంచాలని ప్రస్తుత సంవత్సర పంటకు పెట్టుబడి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ విలేకరుల సమావేశంలో జిల్లా కన్వీనర్ బుచ్చిబాబు తో పాటు వెంకట రాములు గోపాల్ పాల్గొన్నారు.

# భవిత కేంద్ర నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే

**వనపర్తి ప్రతినిధి, జూలై 30 ప్రభాతవార్త:** వనపర్తి నియోజకవర్గం పెద్దమందడి మండలం పామిరెడ్డిపల్లి గ్రామంలో బుధవారం వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి రూ. 8 లక్షల వ్యయంతో చేపట్టనున్న భవిత కేంద్రం భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు సంబంధించిన విద్యార్థులకు అనుగుణంగా విద్యా బోధన అందించేందుకు ఈ కేంద్రం ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు. బుద్ధి వైకల్యం కలిగిన ప్రతి ఒక్కరూ ఇక్కడ అందించే అధునాతన విద్యను సద్వినియోగం చేసుకోవాలనీ ఎమ్మెల్యే సూచించారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం తయారు చేయడానికి నూతన వంటగది నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ, రఘు ప్రసాద్, గ్రామ నాయకులు శ్రీశైలం, చందు విద్యాశాఖ అధికారులు మహానంది ఎంఈఓ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



భవిత కేంద్రం భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే

**ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేసిన ఎమ్మెల్యే**

పెద్దమందడి మండలం చిన్న మందడి గ్రామానికి చెందిన పద్మమ్మ భర్త కురుమూర్తి, శాంతమ్మ భర్త రాములు చెందిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలకు వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి బుధవారం భూమిపూజ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు అవుతున్నాయని మంజూరైన ఇండ్లను సకాలంలో పూర్తి చేసుకోవాలన్నారు. ఇల్లు పూర్తి చేసుకున్న లబ్ధిదారుల గృహప్రవేశాలకు వచ్చి నూతన వస్త్రాలను అందించి శుభాకాంక్షలు తెలియజేస్తారని ఎమ్మెల్యే కుటుంబ సభ్యులకు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పాతపాలెంలో విగ్రహ ప్రతిష్ట, ధ్వజస్తంభ మహోత్సవం

### కార్యాక్రమానికి హాజరైన బాసు హనుమంతు



ధ్వజారోహణంలో పాల్గొన్న బాసు హనుమంతు, గ్రామ పెద్దలు

**గద్వాలటౌన్ జూలై 30,ప్రభాతవార్త:** గద్వాల నియోజకవర్గం కె.టి.దొడ్డి మండలం పాతపాలెం గ్రామంలోని శివాలయంలో శివలింగం,నంది, గణపతి,సుబ్రహ్మణ్యేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్టలు, ధ్వజస్తంభం మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ మహోత్సవానికి బిఆర్‌యస్ గద్వాల నియోజకవర్గ ఇంచార్జ్ బాసు హనుమంతు నాయుడు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయనకు ఆలయ అర్చకులు,పార్టీ నాయకులు, గ్రామస్తులు శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో చక్రధర్ రావు,జి.రాఘవేంద్ర రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, ఆంజనేయులు,మోనేష్,ఎస్.రాము నాయుడు, సోమశేఖర్ రెడ్డి,వెంకటేష్ నాయుడు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## వాక్సినేషన్‌తోనే శిశు ఆరోగ్యం

### వైద్యాధికారిణి డా. స్వప్న

**ఉప్పునుంతల, జూలై 30 ప్రభాతవార్త :** పుట్టిన వెంటనే ప్రారంభమయ్యే టీకా ప్రక్రియ ప్రతి ఒక్క చిన్నారికి తప్పనిసరిగా సమయానికి జరగాలని వైద్యాధికారిణి డా. స్వప్న సూచించారు. బుధవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చిన్నారుల టీకా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని వైద్యాధికారిణి డా. స్వప్న పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టిన వెంటనే ప్రారంభమయ్యే టీకా ప్రక్రియ ప్రతి ఒక్క చిన్నారికి తప్పనిసరిగా సమయానికి జరగాలని జరగాలని, అప్పుడే పుట్టిన శిశువుల నుంచి 10 ఏళ్ల వయసు వచ్చేవరకు చిన్నారులకు వివిధ వ్యాధుల నుంచి రక్షణ కలిగించేందుకు ప్రభుత్వాలు ఉచితంగా టీకాలు అందిస్తుందని, చిన్నారుల తల్లిదండ్రులు తమ బాధ్యతగా ఈ టీకాలు సమయానికి వేయించుకోవాలని వైద్య అధికారిణి సూచించారు. అవసరమైన టీకాలు వేసిన పిల్లలే భవిష్యత్తులో ఆరోగ్యంగా ఎదుగుతారని, ఆసుపత్రికి వచ్చే గర్భిణుల కు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్య సిబ్బందికి ఆమె అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి డా.స్వప్నతోపాటు వైద్యసిబ్బంది దేవి,ఉపతి,ఆశా కార్యకర్తలు, గర్భిణీలు, బాలింతలు, చిన్న పిల్లల తల్లులు ఉన్నారు.

## మోడల్ పాఠశాలలో స్పాట్ అడ్మిషన్స్

**వెల్దండ, జూలై 30 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని మోడల్ పాఠశాలలో 6వ తరగతి నుండి 9వ తరగతి వరకు మిగిలిన సీట్లను భర్తీ చేసేందుకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీధర్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ నేడు 31వ తేదీ నుండి ఆగస్టు 4వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని, పాఠశాలలో అధునాతనమైన టెక్నాలజీ ఖాన్ అకాడమీలో బోధన విశాలమైన అటల్ థింకరింగ్ ల్యాబ్ సైన్స్ ల్యాబ్ ప్యానల్ బోర్డులో కంప్యూటర్‌లో శిక్షణ తరగతులు నిర్వహిస్తామని అన్నారు.

## విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షురాలికి సన్మానం



విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షురాలిని సన్మానిస్తున్న దృశ్యం

**నారాయణపేటటౌన్, జూలై 30 ప్రభాతవార్త :** నారాయణ పేట జిల్లా నూతన విశ్వహిందూ పరిషత్ అధ్యక్షురాలుగా ఎన్నికైన బి. సురేఖను బుధవారం భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకులు నాగురావు నామాజీ, బిజెపి జిల్లా అధ్యక్షులు యాదవ్‌లు శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. సన్మాన కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు వినోద్‌కుమార్, మాజీ సర్పంచ్ సాయిబన్నతో బాటు తదితరులు ఉన్నారు.

## నూతన రేషన్ కార్డ్ పంపిణీలో పాల్గొనండి

### వ్యవసాయ మార్కెట్ వైస్ ఛైర్మన్ విజయ వర్ధన్ రెడ్డి

**పెబ్బేరు, జూలై 30 ప్రభాతవార్త :** స్వరాష్ట్రము తెలంగాణలో తెలంగాణ ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నిరుపేద లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియ వనపర్తి నియోజకవర్గం పెబ్బేరు మండలంలో వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి చేతులమీదుగా ఆగస్టు1 శుక్రవారం ఉదయం 10గం.లకు సహారా ఫంక్షన్ హాల్ నందు నిర్వహించబడుతుందని వ్యవసాయ మార్కెట్ వైస్ ఛైర్మన్ విజయ వర్ధన్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మండలంలోని అందరు లబ్ధిదారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానూలు పాల్గొని కార్యక్రమం జయప్రదం చేయగరని కోరారు.

# పీయూలో ఇంజినీరింగ్ అడ్మిషన్లు షురూ..

■ డేటా సైన్స్‌లో తొలి అడ్మిషన్ పొందిన టీనా కుమారి



అడ్మిషన్ తీసుకుంటున్న టీనా కుమారి

**మహబూబ్‌నగర్, జూలై30, ప్రభాతవార్త:** టిజిఏప్ సెట్‌లో వచ్చిన ర్యాంక్ ఆధారంగా పాలమూరు యూనివర్సిటీ క్యాంపస్‌లో ఇంజనీరింగ్ కోర్సులో అడ్మిషన్స్ ప్రారంభం అయ్యాయి. ఈ మేరకు సీట్ వచ్చిన విద్యార్థులు బుధవారం పీయూలోని ఇంజినీరింగ్ కాలేజీలో అవసరమైన సర్టిఫికెట్స్ సమర్పిస్తున్నారు. విద్యార్థుల యొక్క రిపోర్ట్స్ సరళిని ఉపకులపతి ఆచార్య జి ఎన్ శ్రీనివాస్, రిజిస్ట్రార్ పూస రమేష్‌బాబు ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్ చంద్ర కిరణ్, వార్డెన్ డాక్టర్ కృష్ణయ్యతో కలిసి పరిశీలిస్తున్నారు. ఈ సంద ర్భంగా వీసీ మాట్లాడుతూ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందిగాకలగకుండా అడ్మిషన్స్ ప్రక్రియ సజావుగా సాగాలని, విద్యార్థులు సీట్ అలాట్మెంట్ ఆర్డర్‌తో పాటు అవసరమైన డాక్యుమెంట్స్ అందజేయాలని అన్నారు.

**ఫస్ట్ అడ్మిషన్ టీనా కుమారి :** టీనా కుమారి అనే విద్యార్థిని మొట్టమొదట పాలమూరు యూనివర్సిటీ ఇంజనీరింగ్ కోర్స్ డేటా సైన్స్ సబ్జెక్టులో అడ్మిషన్ పొందారు. జోగులాంబ గద్వాల జిల్లా, రాజోలి మండలం, చిన్నదన్వాడ గ్రామం. ఈ మేరకు ఇంజనీరింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్ర కిరణ్ టినా కుమారి కి అడ్మిషన్ పొందినది అని అక్నాలెడ్జ్మెంట్ ఆర్డర్ అందజేశారు. రామేశ్వర్, భరత్, నరేష్, మల్లికార్జున్‌రెడ్డి, రవిలు ప్రిన్సిపాల్ తో పాటు అడ్మిషన్స్ ప్రక్రియ లో పాల్గొన్నారు.

# చట్టపరంగా జీవించాలి

■ మహబూబ్‌నగర్ డీఎస్పీ వెంకటేశ్వర్లు



అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

**మహబూబ్ నగర్, జూలై30, ప్రభాతవార్త:** చట్టపరంగా, చట్టానికి లోబడి జీవించాలని డీఎస్పీ వెంకటేశ్వర్లు సూచించారు. జిల్లా ఎస్పీ డి.జానకి ఆదేశాల మేరకు మహబూబ్‌నగర్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని "అల్మాస్ ఫంక్షన్ హాల్‌లో 'ప్రజాభద్రత – పోలీసు బాధ్యత" కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీఎస్పీ వెంకటేశ్వర్లు హాజరై అవగాహన కల్పించారు. గ్రామాలు, పట్టణాలు, మారుమూల ప్రాంతాలలోని ప్రజలకు పోలీసు సేవలను మరింత చేరువ చేయడం, చట్టాలపై అవగాహన కల్పించడం, నేరాలనివారణకు ప్రజలను చైతన్య వంతం చేయడంవంటి అంశాలపై వివరంగా వెల్లడించారు. వర్గాలుగా విడిపోయి గొడవలు పెట్టడం సమాజ అభివృద్ధికిఆటంకం, రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లు అన్నివేళలా పోలీసు రికార్డులో ఉంటారని, ఇది జీవితాంతం మచ్చ అని హెచ్చరించారు. సైబర్ మోసాలకు లొంగకండి, ఆశలకు బలి కాకండి. "డ్రగ్స్, గంజాయి, మద్యం, పేకాట – ఇవి జీవితాలను నాశనం చేస్తాయని జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ప్రజలతో పోలీసులభాగస్వామ్యం ద్వారా సమాజ శాంతి భద్రతలు మెరుగుపడతాయని, సమస్యలు ఉన్నచో నిర్భయంగా పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. కార్యక్రమంలో వన్ టౌన్‌ఇనస్పెక్టర్ అప్పయ్య, ఎస్ఐలు శీనయ్య, రషీద్, మహిళా పోలీస్ స్టేషన్ ఎస్ఐ సుజాత, ఏఎస్ఐ మహమ్మద్ ఆరిష్ నవాజ్, వారి సిబ్బంది కాలనీవాసులు, యువకులు, విద్యార్థులు ఉపాధ్యాయులుసురక్ష పోలీసు కళాబృందం సభ్యులు డి.రాములు, బి.జగదీశ్, బాలరాజు పాల్గొన్నారు.

# విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలి

◆ గద్వాల జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ ◆ ప్రధానోపాధ్యాయురాలికి మెమో జారీకి కలెక్టర్ ఆదేశం



వంటశాలలో మెనూ చూస్తూ, వంటలను , హాజరు పట్టికను పరిశీలిస్తున్న కలెక్టర్ సంతోష్

**గద్వాల టౌన్ జూలై30, ప్రభాతవార్త:** విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించకపోతే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ అన్నారు. బుధవారం గద్వాల్ మండలంలోని గోనుపాడు గ్రామంలో కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని తరగతి గదులు, వంటగది, త్రాగునీరు, మధ్యాహ్న భోజనం నాణ్యత, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విద్యార్థులతో ప్రత్యక్షంగా మాట్లాడి ఇప్పటి నుండే ఇష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలన్నారు. ఈ సందర్భంగా వారి హాజరును స్వయంగా పరిశీలించారు. విద్యార్థులు పూర్తి శ్రద్ధతో చదువుపై దృష్టి కేంద్రీకరించాల్సిన అవసరం ఉందని అన్నారు. సబ్జెక్టులలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. మధ్యాహ్న భోజన తనిఖీలో మెనూ ప్రకారం భోజనం అందించకపోవడంతో, ప్రధానోపాధ్యాయురాలికి మెమో జారీ చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉండేందుకు మెనూ ప్రకారం ప్రతి రోజు పౌష్టికాహారం ఇవ్వాలని, ఆహార పదార్థాలు నాణ్యంగా ఉండేలా చూడాలన్నారు. వంట కోసం తాజా కూరగాయలు, నాణ్యతగల సరుకులు మాత్రమే వినియోగించాలన్నారు. వంటశాల ప్రదేశం, వంట పాత్రలు ఎప్పుడూ శుభ్రంగా ఉండేలా చూడాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన బోధన, రుచికరమైన ఆహారం, ఆరోగ్యం అందించాలని, ఇట్టి విషయంలో నిర్లక్ష్యం తగదని హెచ్చరించారు. విద్యార్థుల హాజరును సాంకేతికంగా పర్యవేక్షించేందుకు ఫేషియల్ రికగ్నిషన్ వ్యవస్థను నిత్యం వినియోగించాలని అన్నారు. యుడైస్ ఎంట్రీలు సమయానికి అప్‌డేట్ చేయాలని సూచించారు. పాఠశాల పరిసరాలనుఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని అన్నారు. ఈ కార్యక్ర మంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలను సందర్శించిన శిక్షణ కలెక్టర్

**ఊట్కూర్, జూలై30 ప్రభాతవార్త:** ఊట్కూర్ మండల కేంద్రం, బిజ్వార్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శిక్షణ కలెక్టర్ ప్రణయ్ కుమార్ సందర్శించి, పాఠశాలలోని విద్యార్థుల యొక్క ఎఫ్ఆర్ఎస్‌ను పరిశీలించి ప్రతిరోజు కూడా ఎఫ్ఆర్ఎస్ పైన ప్రత్యేక శ్రద్ధ వహించాలని 100 ఎఫ్ఆర్ఎస్ జరగాలని సూచించడమైనది. పాఠశాలలోని అన్ని రికార్డులను తనిఖీ చేసి పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు అందరూ కూడా మంచి ఫలితాలు సాధించాలని 575 మార్కులకు పైచిలుకు సాధించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు, కిషోర్ కుమార్‌కు తెలియజేయడం జరిగింది. పాఠశాలకు రాని విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ప్రతిరోజు విద్యార్థులు పాఠశాలకు వచ్చేటట్లు చూడాలని తెలియపరిచారు. పాఠశాలలో విద్యార్థులు తయారు చేసినటువంటి ఆర్ట్ క్రాఫ్ట్ కృత్యాలు చూసి విద్యార్థులను ఆర్ట్ క్రాఫ్ట్‌కు సంబంధించిన మనోహర్ (క్రాఫ్ట్), హర్షద్ ఖాన్(ఆర్ట్)ఉపాధ్యాయులను అభినందించారు శిక్షణ కలెక్టర్ ప్రణయ్ కుమార్, ఊట్కూర్ మండల ఎంపీడీవో ధనుంజయగౌడ్, స్పెషల్ ఆఫీసర్, కాంప్లెక్స్ గౌరమ్మ మేడం, గ్రామపంచాయతీ కార్యదర్శి తదితరులు రావడం జరిగింది పాఠశాల ఉపాధ్యాయాలు మహేష్, నాగరాజ్, గజలప్ప, మనోహర్ హర్షద్ ఖాన్, చంద్రశేఖర్, నరేష్, శేఖర్, యాసిన్ బేగం, కృష్ణ పాల్గొన్నారు.

## పసిడి పథకాలు సాధించిన అథ్లెటిక్స్ క్రీడాకారులు

◆ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక



**చిన్నచింతకుంట, జూలై30 ప్రభాతవార్త:** అథ్లెటిక్స్ పోటీలలో రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు అల్లిపూర్ గ్రామ క్రీడాకారులు. అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 29న మంగళవారం నిర్వహించిన వనపర్తి జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో అల్లీపూర్ గ్రామానికి చెందిన సుచిత్ర సబ్ జూనియర్ బాలికల విభాగంలో 60మీటర్ల పరుగుపందెంలో మరియు బ్రాడ్ జంప్‌లో పాల్గొని ప్రథమ స్థానంలో గెలుపొంది రెండు బంగారు పతకాలు సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించింది. గ్రామానికి చెందిన కిరణ్ సబ్ జూనియర్ బాలుర విభాగంలో బ్రాండ్ జంప్‌లో పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతాకాన్ని సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించాడు. ఈ ఇరువురు క్రీడాకారులు ఆగస్టు 7న జనగాం జిల్లాలోని ధర్మ కాంచ స్టేడియంలో జరగబోయే నాలుగవ జావేలే న్ డే సెలబ్రేషన్ అండ్ కిడ్స్ అథ్లెటిక్స్ మీట్‌లో పాల్గొంటారని అథ్లెటిక్ అసోసియేషన్ కార్యదర్శి నందిమల్ల శ్రీకాంత్, కోచ్ నవీన్ తెలిపారు. గ్రామస్థాయి నుండి అథ్లెటిక్స్ క్రీడల్లో రాణించి రాష్ట్ర స్థాయి క్రీడలో రాణించడంపై తల్లితండ్రులు, గ్రామస్థులు, పలువురు క్రీడాకారులు అభినందనలు తెలిపారు.

## మాదక ద్రవ్యాలపై అవగాహన

**ఊట్కూర్ జూలై 30 ప్రభాతవార్త :** జిల్లా వికలాంగుల, వయోవృద్ధుల మరియు ట్రాంజెండర్స్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో నారాయణపేట జిల్లాలోని ఉట్కూర్ మండలంలోని ప్రభుత్వ కళాశాలలో మాదక ద్రవ్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా వాలంటీర్లు లక్ష్మీకాంత్, సంధ్య మాట్లాడుతూ ఈ డ్రగ్స్ అనేది మన దేశానికి పట్టిన రోగం అని, గంజాయి వాడటం వల్ల కలిగే నష్టాల గురించి, వాటిని తీసుకుంటే జీవితాలు నాశనం అవుతాయని డ్రగ్స్‌కి దూరంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నషముక్త్ భారత్ అభియాన్ వాలంటీర్లు సంధ్య, లక్ష్మీకాంత్, స్టాఫ్, పిల్లలు పాల్గొన్నారు.

# కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు

ఎరువులను ఎంఆర్పీ ధరల కన్నా అధిక ధరలకు అమ్మితే చర్యలు తప్పవు : వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



ఎరువుల దుకాణాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

**వనపర్తి / ఖిల్లాఘనపురం. జూలై 30 ప్రభాతవార్త :** బుధవారం ఖిల్లా ఘనపూర్ మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణాల్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణాల బయట రాసిపెట్టిన ఎరువు నిలువలను షాపు, గోదాములో ఉన్న నిలువల ను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎరువుల దుకాణాల్లో ఎరువుల బస్తాల్ని ఎంఆర్పీ ధరలకన్నా అధిక ధరలకు అమ్మితే చర్యలు తప్పవని అన్నారు. ఎప్పటిక ప్పుడు ఆకస్మిక తనిఖీలు చేయాలని, ధరలనుపర్యవేక్షించాలని కలెక్టర్ వ్యవసాయధికారికి సూచించారు. రైతులకు అవసరమైన మేరకు మాత్రమే ఎరువులు ఇవ్వాలని, అవసరానికి మించి ఎరువులు ఇచ్చి లేదా కృత్రిమ కొరత సృష్టిస్తే మాత్రం చర్యలు తప్పవని హెచ్చరించారు. అన్ని ఎరువుల దుకాణాల బయట నిలువ, ధరల సూచిక బోర్డు ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డిఎపి, యూరియా, జిప్సం వంటి ఎరువుల నిల్వలను పరిశీలించారు. అమ్మిన ప్రతి ఎరువు బస్తా పూర్తివివరాలురికార్డులో ఎంట్రీ చేయాలన్నారు. రోగులకు మెరుగైన వైద్య సేవలుఅందించాలి. ఖిల్లా ఘనపూర్ మండల కేంద్రం లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సామాజిక ఆరోగ్య కేంద్రంలో కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యులు సమయానికి విధులలో ఉండి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. పీహెచ్‌సిలో ఈడిడి రిజిస్టర్ పరిశీలించిన కలెక్టర్ ప్రసవాలపై ఆరా తీశారు. గర్భిణీలకుపౌష్టికహారాంపై అవగాహన కల్పించాలని సూచించారు. గర్భిణుల ఎఎన్‌సి పరీక్షలు సకాలంలో నిర్వహించి సాధారణ ప్రసవాలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోనే నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ముందు ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలని ఎంపీడీవోకు సూచించారు. జ్వరం, జలుబు, దగ్గు లక్షణాలతో వచ్చే రోగులకు తప్పనిసరిగా రక్త పరీక్షలు నిర్వహించాలని, డెంగ్యూ, మలేరియా వంటివి పాజిటివ్ రిపోర్టు వస్తే ఎలిజా పరీక్షలకు టి హబ్‌కు రక్త నమూనా పంపించాలని ఆదేశించారు. పాము, కుక్క కాటుకు సంబంధించినవ్యాక్సిన్ మందులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. వైద్యులు సమయపాలన పాటించి రోగులకు అందుబాటులో ఉండాలని సూచించారు. అనంతరం ఖిల్లాఘన్‌పూర్ తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్ భూభారతి రెవెన్యూ దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లా వ్యవసాయఅధికారి ఆంజనేయులుగౌడ్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి శ్రీనివాసులు, తహసిల్దార్ సుగుణ, ఎంపీడీవో, ఇతర అధికారులు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

# భూభారతి సమస్యల పరిష్కారంలో వేగం పెంచాలి : జిల్లా కలెక్టర్



ఆత్మకూరులోని తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ నిర్వహిస్తున్న జిల్లా కలెక్టర్

**ఆత్మకూర్ జూలై30, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్నటువంటి భూభారతి రెవెన్యూ చట్టంలో భాగంగా ఆత్మకూరు మండలంలో భూభారతి సదస్సుకు వచ్చిన సమస్యలు పరిష్కరించడంలో అధికారులు వేగం పెంచాలని మన ప్రతి జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి ఆదేశించారు. ఈ మేరకు ఆయన బుధవారం రోజు ఆత్మకూరులోని తహసిల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి భూభారతి సమస్యలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూభారతి చట్టంలో భాగంగా మండలంలో ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులు ఎన్ని అందులో పరిష్కరించబడినవి ఎన్ని వెంటనే జిల్లా కలెక్టర్ ఆన్లైన్ కార్యాలయానికి నివేదికలు అందజేయాలని ఆయన ఆదేశించారు. గత నెలలో నిర్వహించిన భూపాల తెలివిని సదస్సులలోభాగంగా వచ్చిన దరఖాస్తులను తక్షణమే పరిష్కరించి రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆయన కిందిస్థాయి అధికారులు ఆదేశించారు. అనంతరం ఆత్మకూర్ మార్కెట్ యార్డ్ ఆవరణలో ఆత్మకూర్ మార్కెట్ కమిటీ నూతనపాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవాల్లో పాల్గొని అర్హులైన లబ్ధిదారులకు రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మక్తల్ నియోజకవర్గం లోని ఆత్మకూరు మండలానికి 400 మందికి ఇందిరమ్మఇండ్లు మంజూరయ్యాయని అదేవిధంగా రేషన్ కార్డులకు సంబంధించి కొత్తగా 400 రేషన్ కార్డులు మంజూరయ్యాయని దీంతో పాటుగా 3500 మంది రేషన్ కార్డుల్లో పేర్ల మార్పులు చేర్పులు చేసేందుకు అవకాశం ఏర్పడిందని ఆయన తెలిపారు. గతంలో కంటే ప్రస్తుత ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేస్తున్న నేపథ్యంలో లబ్ధిదారులు ప్రజాప్రభుత్వం పట్ల సానుకూలంగా వివరిస్తున్నారని సన్న బియ్యం పంపిణీ చేయడంతో తాము మూడు పూటలా సంతృప్తిగా తినగలుగుతున్నామని పలువురు లబ్ధిదారులు తనకు వివరించడం ఎంతో సంతోషాన్ని కలిగించిందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పాడి పరిశ్రమ అభివృద్ధి శాఖ మంత్రి వాకిటి శ్రీహరి మాజీ రాజ్యసభ సభ్యులు అజారుద్దీన్ ఆత్మకూర్ తాసిల్దార్ జాన్ పాషా పలువురు అధికారులు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలను గూడ్స్ వాహనాల్లో రవాణా చేయరాదు

■ మద్దూర్ ఎస్సై విజయ్ కుమార్



గూడ్స్ వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్సై

**మద్దూర్, జూలై 30 ప్రభాతవార్త :** మద్దూర్ పట్టణ కేంద్రంలో బుధవారం రోజు మద్దూర్ ఎస్సై విజయ్ కుమార్ ఆధ్వర్యంలో మద్దూరు పోలీసులు ఆకస్మికంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు, చిన్న పిల్లలను గూడ్స్ వాహనాలలో రవాణా చేస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్ఐ విజయ్‌కుమార్ గూడ్స్ వాహనదారుల యజమానులకు హెచ్చరించారు. ఈ సందర్భంగా మద్దూర్ ఎస్సై విజయ్‌కుమార్ మాట్లాడుతూ రవాణా చట్ట ప్రకారం గూడ్స్ వాహనాలు కేవలం సరుకుల రవాణా కోసమే ఉపయోగించాలి వాటిలో వ్యక్తులను, కూలీలను, చిన్నపిల్లలను రవాణా చేయడం నేరమని తెలిపారు. గూడ్స్ వాహనాల్లో ప్రయాణించడం వల్ల తీవ్ర ప్రమాదాలు, రోడ్డు ప్రమాదాలుసంభవించే అవకాశం ఎక్కువ ఉంటాయని తెలిపారు. వాహనదారులు, డ్రైవర్లు గూడ్స్ వాహనాల్లో వ్యక్తులను తీసుకెళ్లినట్లు గుర్తించిన పక్షంలో సంబంధిత వాహనం పై చర్యలు తీసుకొని వానాలను సీజ్ చేయడం జరుగుతుందని హెచ్చరించారు. ప్రజలు కూడా తమ ప్రాణాలను ముప్పుగా మారే ఈ విధానాన్ని ఎట్టి పరిస్థితుల్లో అనుసరించరాదని కోరారు. ప్రతి ఒక్కరు రవాణా నియమాలు గౌరవించి సురక్షిత రవాణా కోసం బస్సులు, ఆటోలు, టాక్సీల వంటివి వాడాలి అని మీ ప్రాణాలు మీ చేతిలో ఉన్నాయి అని గుర్తుంచుకొని ప్రయాణం చేయాలని ఎస్ఐ తెలిపారు. ఈ కార్యక్రమంలోపోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# గుట్టలు నేలమట్టం

**భూత్పూర్, జూలై30, ప్రభాతవార్త:** భూత్పూర్ మండలం తాటికొండలో కొందరఅక్రమార్కులు కొండల్ని పిండి చేస్తూ అక్రమార్జనకు పాల్పడుతున్నారు. సమీపంలోని అల్లీపూర్ గుట్టను కొందరు ధనార్జనే ధ్యేయంగా తవ్వుతూ టిప్పర్లు, ట్రాక్టర్లు, బెంజి వాహనాలను మట్టిని తవ్వి ట్రిప్పుల మీద ట్రిప్పులు కొడుతూ వేలకు వేలు జేబులు నింపుకుంటున్నారన్న ఆరోపణలు గ్రామస్తుల నుంచి బాహాటంగా వినవస్తున్నాయి. ప్రకృతి సహస సిద్ధంగా రూపుదిద్దుకుని ఉంటూవస్తున్న గుట్టలు, కొండల్నిఇలా పిండిచేస్తుంటే పట్టించుకునే నాథుడేలేడని పలువురుపెదవి విరుస్తున్నారు. మారుమూల గ్రామమని కొందరు అక్రమార్కులు టిప్పర్లు, బెంజి లారీలు గుట్టుచప్పుడు కాకుండా ఇసుకను, మట్టిని అక్రమంగా తరలిస్తూ సొమ్ముచేసుకుంటున్నారనిపలువురు ఆరోపిస్తున్నారు. గుట్టలు, కొండలు, మట్టిని తవ్వాలంటే మైనింగ్‌శాఖ, పోలీస్, రెవెన్యూ శాఖల అనుమతులు తప్పనిసరిగా కాగా, ఇవేవి లేకుండా మట్టిని, ఇసుక అక్రమంగా తరలిస్తు చట్టవిరుద్ధమైన పనులు చేస్తున్నారనే ఆరోపణలు బాహాటంగా వినవస్తున్నాయి. సంబంధిత మైనింగ్, పోలీస్, రెవెన్యూ అధికారులు ఇలాంటి అక్రమార్కులపై కొరఢా ఝుళిపించాల్సిన అవసరమెంతైనా ఉందని పలువురు తమ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

## కృష్ణా నదికి భారీగా పెరిగిన వరద ఉధృతి

నదీతీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: కృష్ణ ఎస్సై ఎస్ఎం నవీద్

**కృష్ణ, జూలై30 ప్రభాతవార్త:** కర్ణాటక రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలకు నారాయణపూర్ డ్యాం జలాశయం పెరిగి 25 గేట్లు ఎత్తగా పై నుండినీటి ప్రవాహం ఉధృతి పెరగడంతో జూరాల డ్యాం 12గేట్లు కూడా తెరిచారు. దీంతో కృష్ణా నది నిండు కుండలా ప్రవహిస్తుంది. బుధవారం కృష్ణానది వరద ఉధృతిని పరిశీలించిన ఎస్ఐ నవీద్ నదీతీర గ్రామాలైన గుర్జాల, హిందూపూర్, గుడేబల్లూరులోని వాసునగర్, ముడుమల్, మందిపల్లి నదీతీర ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. నది లోకి చేపలు పట్టడానికి, ఇతర పొలంపనులకు, పశువులనుమేపడానికి వెళ్లరాదని, పిల్లలు సరదాగా ఈత కొట్టడానికి, సెల్ఫీ ఫోటోలు దిగడానికి వెళ్లరాదని ప్రజలు జాగ్రత్తగాఉండాలని సూచించారు. ప్రజలు అత్యవసర సమయంలో సంబంధిత పోలీసు అధికారులకు లేదా డయల్ 100 కి కాల్ చేసి సమాచారం ఇవ్వాలని ఎస్ఐ నవీద్ సూచన చేశారు.



వరద పరిస్థితిని పర్యవేక్షిస్తున్న పోలీసులు

## ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్ మృతి

**కల్వకుర్తి, జూలై 30 ప్రభాతవార్త:** కల్వకుర్తి మండలం తర్నికల్ గ్రామ సమీపంలో నిర్వహించిన ఓ ప్రమాదంలో ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్ మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం తర్నికల్ గ్రామానికి చెందిన దేరంగుల వెంకటయ్య (45) గ్రామం నుంచి కల్వకుర్తి వైపు ట్రాక్టర్ నడుపుకుంటూ వస్తుండగా అదుపుతప్పి బోల్తా పడింది. తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహన్ని పోస్టు మార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

## మృతిడి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

**వెల్దండ, జూలై 30 ప్రభాతవార్త:** వెల్దండ మండలంలోని బండోనిపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు శేఖర్‌రెడ్డి తండ్రి ఎనుముల నారాయణరెడ్డి మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వెల్దండ గ్రామ మాజీ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి, మాజీ ఎంపీటీసీ వెంకటరెడ్డితో పాటు గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

## విద్యార్థిని పరామర్శించిన ఎమ్మెల్యే

**మానవపాడు, జూలై 30 ప్రభాతవార్త:** మండల పరిధిలోని కలుగొట్ల గ్రామంలో కేజీబీవీ పాఠశాలలో చదువుతున్న మెన్నిపాడు గ్రామానికి చెందిన విద్యార్థిని దాక్షాయని బుధవారం పాము కాటుకు గురైంది. కేజీవీబీ పాఠశాల సిబ్బంది చికిత్స నిమిత్తం విద్యార్థిని కర్నూల్‌లోని ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు హాస్పిటల్‌కి వెళ్లి విద్యార్థిని పరామర్శించి ఆరోగ్యంపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట బిఆర్ఎస్ కలుగొట్ల పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఉయ్యాలవాడ గజేందర్ రెడ్డి, రఘురెడ్డి, అశోక్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

## ఖిల్లా వైన్ షాపులో చోరీ

**ఖిల్లాగణపురం జూలై 30. ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని స్థానిక వైన్ షాపులో మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు షెటర్లు కట్ చేసి చోరీకి పాల్పడినట్లు వైన్ షాప్ యజమానులు తెలిపారు. వారి కథనం ప్రకారం బుధవారం ఉదయం 6 గంటలకు పక్క షాప్ కు సంబంధించిన వ్యక్తి ఐరన్ సీట్లు తెరిచి ఉండడం గమనించి వైన్ షాప్ యజమానులకు తెలియజేయడంతో భాగస్వామ్యం కలిసి అక్కడికి వెళ్ళామని, వైన్ షాప్ లో 10000 నగదు తో పాటు మొబైల్ ఫోన్ అయినట్లు గుర్తించారు. ఇట్టి విషయమే పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశామన్నారు ఎస్ఐపి నరేష్ వైన్ షాప్ యజమాని గోదా చిన్న ఆంజనేయులు గౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# నూతన రేషన్ కార్డులు పంపిణీ

**కల్వకుర్తి, జూలై 30 ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణంలోని పలు వార్డులలో నూతనంగా మంజూరైనా రేషన్‌కార్డులు, రేషన్ షాపుల వద్ద లబ్ధిదారులకు మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో ఎన్నికల హామీల్లో భాగంగా 6గ్యారంటీలను ప్రభుత్వం పకడ్బందీగా అమలు చేస్తుందని, రైతులందరికీ రుణమాఫీ ఇందిరమ్మ ఇల్లు, రైతు భరోసా, రైతు బీమా, కొత్త రేషన్ కార్డుల పంపిణీ, ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణం ఎన్నో సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు చిన్న రాంరెడ్డి, షాన్‌వాజ్ ఖాన్, గోరటి శ్రీను, మిర్యాల శ్రీనివాస్ రెడ్డి, చంద్రకాంత్‌రెడ్డి, పుస్తకాలరాహుల్, జమ్మల శ్రీకాంత్, నాని యాదవ్, ఆరిఫ్, మహిళా నాయకురాలు రేష్మబేగం పాల్గొన్నారు.

## మార్చాల కాంగ్రెస్ పార్టీ గ్రామ నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

**కల్వకుర్తి, జూలై30 ప్రభాతవార్త:** కల్వకుర్తి మండలంలోని మార్చాల గ్రామంలో బుధవారం మార్చాల కాంగ్రెస్ పార్టీ గ్రామ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షులుగా మహమ్మద్ దస్తగిరి, ఉపాధ్యక్షులుగా యద్మ శేషిరెడ్డి, పోలేరవి, గుండె బాలకృష్ణయ్య గౌడ్, ఆవ గణేష్, రామాంజనేయులు, కార్యనిర్వహక అధ్యక్షులుగా అదిరాల యాదయ్య, ప్రధాన కార్యదర్శిగా తాండ్ర వెంకటయ్య, కార్యదర్శులుగా చాకలి శ్రీశైలం, తిరుపతయ్య, మేకల కురుమయ్య, చెదురుపల్లి శ్రీశైలం, కోశాధికారిగా బి. సుధాకర్ రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా కొత్తోల్ల పరుష రాములు, టి శ్రీకాంత్ రెడ్డి, మోటాపురం ఆంజనేయులు, గొడుగు శ్రీనివాసులు, నామని శ్రీనివాసులు, గోరేటి చిన్న జంగయ్య, వట్టేపు రామస్వామి, నామని రామకృష్ణ, తలారినరేష్, ఏ.కిరణ్‌రెడ్డి, కొత్తోల్ల చెన్నయ్య, మోటాపురం రవి, ఒర్సు రవిలను ఏకగ్రీ వంగా ఎన్నుకున్నారు. ముఖ్య సలహాదారులుగా తలసాని లక్ష్మారెడ్డి, రామిరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, నిజామోద్దీన్, పలుస రామచంద్రయ్యగౌడ్, గొడుగుజలాల్, మేకలపాండు, సాధు, అంజారెడ్డి, పర్వతరెడ్డి, జి.రాంరెడ్డి, ఆవరామచంద్రయ్య, యాదయ్యగౌడ్‌లునియమితులయ్యారు. కాంగ్రెస్ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని అన్నారు. గతంలో అధ్యక్షుడిగా పనిచేసిన తలసాని శ్రీధర్‌రెడ్డికి, నూతన అధ్యక్షుడు దస్తగిర్‌లను సన్మానించారు.

## నేడు వీరాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట

**వెల్దండ, జూలై 30 ప్రభాతవార్త:** కల్వకుర్తి మండలంలోని కుందారం తండాలో శ్రీశ్రీ వీరాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని కనుల పండుగగా నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. భక్తిశ్రద్ధలతో వేదమంత్రచరణ మధ్య నిర్వహించే ప్రతిష్ట కార్యక్రమానికి భక్తులు పెద్ద ఎత్తున హాజరై స్వామి వారి కృపకు పాత్రులు కావాలన్నారు.

## తడిచెత్త పొడిచెత్త పై అవగాహన

**మద్దూర్, జూలై 30 ప్రభాతవార్త:** తడిచెత్త పొడిచెత్త పై మున్సిపాలిటీ ప్రజలకు బుధవారం రోజు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి కాలనీకి చెత్త బండి వచ్చిన వెంబడి తడి చెత్త పొడి చెత్త వేరువేరుగా ఇవ్వాలని ప్రజలకు కమిషనర్ శ్రీకాంత్ తెలియజేశారు. అదేవిధంగా గోడలపైపెయింటింగ్‌తో రాయించారు. ఈకార్యక్రమంలో మున్సిపాలిటీసిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

## నేడు భూనిర్వాసితులకు మద్దతుగా ఎమ్మెల్సీ కవిత రాక

**దామరగిద్ద, జూలై30 ప్రభాతవార్త:** దామరగిద్ద మండలం కానుకుర్తి గ్రామానికి నేడు ఉదయం 11 గంటలకు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత రానున్నారు నారాయణ పేట్ కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ లో భాగంగా అక్రమ భూసేకరణ చేస్తున్నందుకు రైతులు పోరాటం చేస్తున్న సందర్భంగా కానుకుర్తి రిజర్వాయర్ లో దాదాపు 800 ఎకరాలు భూములు పోతున్నాయి మొత్తం ప్రాజెక్ట్ లో 1957 ఎకరాలు భూములు కోల్పోతున్న రైతులు ఉన్నారు వారందరికీ ప్రభుత్వం మెరుగైన నష్ట పరిహారం ఇవ్వాలని, వారికీ మద్దత్తు బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కానుకుర్తి గ్రామంకి వస్తున్నారు. రైతులు అందరు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని గవినోళ్ల శ్రీనివాస్, బాపన్పల్లి మాజి సర్పంచ్ బీఆర్ఎస్ నాయకులు కోరారు.

## శ్రీగెల్వలాంబ మాత ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

**వంగూరు, జూలై 30 ప్రభాతవార్త:** వంగూరు మండల కేంద్రలో వెలిసిన శ్రీ గెల్వలాంబ అమ్మవారి బ్రహ్మోత్సవాల కరపత్రాలు, గోడపత్రికలను అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ సమక్షంలో ఆవిష్కరించారు. అంతకుముందు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీశ్రీశ్రీగెల్వలాంబ మాత అమ్మవారి బ్రహ్మోత్సవాలు ఆగస్టు 13 నుండి జరగనున్నాయి. ఈ కార్యక్రమంలో ఆలయచైర్మన్ నకినమోని శేఖర్ ముదిరాజ్, మండల నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ డీలర్ నియామక పత్రాన్ని అందజేసిన ఎమ్మెల్యే

**చిన్నచింతకుంట, జూలై 30 ప్రభాతవార్త:** కౌకుంట్ల మండలం అప్పంపల్లి గ్రామనూతన రేషన్‌డీలర్‌గా టి.స్వాతి సీతన్నకు స్థానిక ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి బుధవారం నియామక పత్రాన్ని అందజేశారు. రేషన్ డీలర్ కోసం పలువురు వ్రాత పరీక్ష రాయగా టి.స్వాతిఎంపికవడంతో నూతన రేషన్ డీలర్ నియామక పత్రాన్ని అందజేశారు. ప్రభుత్వం నిర్దేశించినప్రకారం లబ్ధిదారులకు సక్రమంగా రేషన్ బియ్యాన్ని పంపిణీ చేయాలని ఎమ్మెల్యే సూచించారు.

## ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

◆ భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ కె.రాజ్ కుమార్

**నారాయణపేట టౌన్, జూలై 30 ప్రభాతవార్త:** పచ్చదనాన్ని పెంపొందించేందుకు ప్రతిఒక్కరూ విధిగా మొక్కలను నాటాలని భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డా. కె.రాజ్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా బుధవారం నారాయణపేట పట్టణ కేంద్రంలోని శాసన్ పల్లి రోడ్డులో ఉన్న కాశీనాథేశ్వర కాలనీలో ఫౌండేషన్ సభ్యులతో కలిసి రాజ్ కుమార్ రెడ్డి మొక్కలను నాటి నీళ్ల పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలునాటడం ఎంత ముఖ్యమో నాటిన మొక్కలను సంరక్షించుకోవడం అంతే ముఖ్యమన్నారు. పెరిగిపోతున్న కాలుష్యాన్ని అరికట్టాలంటే బాధ్యతగా ప్రతి వ్యక్తి 10 మొక్కలు నాటాలన్నారు. ఈకార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు గడ్డం తిప్పమ్మ, మధుసూదన్‌రెడ్డి, రాఘవేందర్‌గౌడ్, శివరాజ్, వై.సంతోష్, మన్నె గోపాల్, నర్సింహ, తదితరులు ఉన్నారు.

## విద్యార్థులకు అభినందనలు

**పెబ్బేరు, జూలై30 ప్రభాతవార్త:** పెబ్బేరు మున్సిపాలిటీ తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థులు ఇటీవల వెలువడిన ట్రిబుల్ ఐటీ ఫలితాలలో సీటు సాధించిన విద్యార్థులను మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ తూర్పుంటి నరేష్ అభినందించారు. మహబూబ్నగర్ ట్రిబుల్ ఐటీ క్యాంపస్‌కి ఎంపికైన జానకిరామ్, అలాగే బాసరా ట్రిబుల్ ఐటీ క్యాంపస్‌కి ఎంపికైన హుజఫ్‌ను మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ తూర్పుంటి నరేష్ అధ్యాపక బృందం అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ భావి భారత జీవితంలో విద్యార్థులు మరింత మెరుగ్గా రాణించి సమాజంలో ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

